# వెలుంగు చూడని నిజం

అది ఓ రైల్వే హాస్పిటల్. ఆ డివిజన్‌లో అదే పెద్ద హాస్పిటల్. చాలా గవర్నమెంటు హాస్పిటల్స్ కంటె, అది పరిశుభ్రంగా వుంటుంది.

ఆ హాస్పిటల్లో ఎమర్జెన్సీ వార్డది. డాక్టర్లు, నర్సులు, హడావిడిగా తిరుగుతున్నారు.

ఆ రోజు తెల్లవారు ఝామున సంభవించిన రైలు ప్రమాదంలో, డ్రైవరు రాంబాబుకి బాగా దెబ్బలు తగిలినయ్. ముఖ్యంగా, రెండు కాళ్ళూ ఫ్రాక్చరయ్యాయి. అతని ప్రాణాల్ని కాపాడేందుకు, రెండు కాళ్ళనీ ముడుకుల వరకూ యేంప్యూట్ చెయ్యక తప్పలేదు.

అతణ్ణి అప్పుడే ఆపరేషను థియేటర్నించి, ఎమర్జెన్సీ వార్డుకి తీసుకొచ్చారు. అతనికింకా స్పృహ రాలేదు.

ఆ పరిస్థితిలో భర్త రాంబాబుని చూసి, శకుంతల స్పృహతప్పి పడిపోయింది. ఆమె కళ్ళల్లో నీరు.... ఆమెని యింటికి తీసుకుపోయారు, కొడుకులు.

ఎవ్వర్నీ రాంబాబు బెడ్ దగ్గరికి వెళ్ళనివ్వడంలేదు, నర్సులు. అప్పుడప్పుడూ డాక్టరు వచ్చి చూసి వెళ్తున్నాడు.

రాంబాబు యిద్దరు కొడుకులు మాత్రం, హాస్పిటల్ వరండాలో స్నేహితులతోపాటు వేచి వున్నారు. తండ్రికి యెప్పుడు స్పృహ వస్తుందోనని ప్రతీక్ష చేస్తున్నారు. వారి వదనాల్లో, దైన్యం స్పష్టంగా అగుపిస్తోంది. తమ కుటుంబ భవిష్యత్తు యెలా వుంటుందోనన్న ఆందోళన, ఆరాటం, భయం, ఆ యువకుల హృదయాల్లో తారాడుతున్నట్టున్నాయి, వారి ముఖ కవళికలు.

ఇరువురు రైల్వే ఆఫీసర్లు వచ్చి, రాంబాబునిచూసి, అతని కొడుకులిద్దరికీ ధైర్యం చెప్పి వెళ్ళారు. అది, మామూలే! రాంబాబు తోటి వుద్యోగులు, స్నేహితులూ వచ్చి వెళ్ళారు.

ఆ రోజు సాయంత్రానికి, రాంబాబుకి స్పృహ వచ్చింది. బాధతో మూల్గాడు. అతని మొహం, పాలిపోయి వుంది. మెల్లగా కళ్ళుతెరిచి చుట్టూ కలయ జూశాడు. ఎదురుగా భార్యా, పిల్లలూ, రోదిస్తూ అగుపించారు. ఏమయ్యిందో అతనికి తెలీదు. నొప్పిగా వున్న రెండు కాళ్ళనీ తడిమి చూసుకున్నాడు. అర్థమయ్యింది. రెండు కాళ్ళూ యేంప్యూట్ చెయ్యబడ్డాయని గ్రహించి, ఒక్కసారి షాక్ తిన్నవాడై, చిన్న పిల్లాడిలా బావురుమన్నాడు.

"రెండు కాళ్ళూ తీసేశారు శకుంతలా!" హృదయ విదారకంగా యేడ్చాడు.

శకుంతల, యిద్దరు కొడుకులూ, దుఃఖాన్ని ఆపుకోలేక, బావురుమన్నారు.

కంగారుగా, డాక్టరు, నర్సు, వచ్చారక్కడికి.

"అలా ఏడవకూడదండీ, రాంబాబుగారూ! ధైర్యంగా వుండాలి" అన్నాడు డాక్టరు, అతణ్ణి సముదాయించే ధోరణిలో. ఏదో మాటవరసకి అలా అన్నాడేగాని, అతనికీ తెలుసు–రాంబాబు ఏడవకుండా వుండలేడని!

"నన్నెందుకు బ్రతికించారు డాక్టర్? ఆపరేషను చేసినప్పుడే, యేదో చిన్న పొరపాటు చేసి, నా ప్రాణాల్ని అనంత విశ్వంలో కలిపేయలేక పోయారా? రెండు కాళ్ళూ పోగొట్టుకున్న కుంటివాడిగా బతకడం కంటె, మరణించడమే బాపుండేది కదా డాక్టర్? కనీసం, మా పెద్దబ్బాయి కయినా వుద్యోగం దొరికేది. ఇలా నేను బతికుండి ప్రయోజనం యేముంది చెప్పండి?...." అంటూ వాపోయాడు, రాంబాబు.

అతని గుండెల్లోంచి పొంగు కొచ్చిన ఆవేదనా భరితమైన అతని మాటలు, చుట్టూ వున్న వాళ్ళందరికీ కన్నీరు తెప్పించింది. హృదయాల్ని ద్రవింపజేసింది. చివరికి, డాక్టరు కూడా చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తు కున్నాడు.

"ఛా! అవేం మాటలండీ రాంబాబుగారూ? జీవితంలో యెన్నో సంఘటనలు సంభవిస్తూ వుంటాయి. అన్నీ ఆనందాన్ని కలిగించేవే కాక పోవచ్చు. కొన్ని ఆవేదనని మోసుకు రావొచ్చు. అలాగని, నిరుత్సాహ పడిపోతే యెలా చెప్పండి? ధైర్యాన్ని కూడదీసుకోవాలి. ఆశతో బ్రతకాలి. మీ నొసట, బ్రతకాలని వుంటే, మీరు చావుని కోరుకున్నా అది మీ దరికి రాదు నిరాశ చెందకండి. మీ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకునయినా, ఆశల్ని పెంచుకోండి. బీ బ్రేవ్ సార్....బీ బ్రేవ్...." అంటూ రాంబాబు భుజాన్ని తట్టి వెళ్ళిపోయాడు, డాక్టరు. అతని వెంట నర్సూ వెళ్ళి పోయింది.

రాంబాబు బరువుగా ఓ నిట్టూర్పు విడిచి, కట్టు కట్టి వున్న చేత్తోనే కళ్ళొత్తుకున్నాడు.

శకుంతల హృదయం మౌనంగా మూలిగింది. తన కలల పంట, తన దేవుడు, యింతలోనే యెలా అయిపోయాడు? భగవంతుడు తనకి యెంత అన్యాయం చేశాడు?.... అని ఆక్రోశించింది.

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి శకుంతలా" రుద్ధ స్వరంతో అన్నాడు, రాంబాబు.

శకుంతల, కళ్ళొత్తుకుంది.

"మనందరి దురదృష్టమండీ! ఏం చేస్తాం? దైవ నిర్ణయాన్ని యెవ్వరూ తప్పించలేరు. మీరు ధైర్యంగా వుండకపోతే, మాకెట్లా గుండె

నిబ్బరం కలుగుతుంది చెప్పండి? భగవంతుడిపై భారం వేసి జీవితాన్ని గడపడమే మన కర్తవ్యం...." ధైర్యాన్ని పుంజుకుంటూ అంది, శకుంతలం అది, కేవలం భర్త అధైర్యంతో దిగజారిపోకండా వుండడానికే!

రాంబాబు, భారంగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"అంతేలే! అంతకంటె మనం చెయ్యగలిగింది మాత్రం యేముందని?" అని మాత్రం అనగలిగాడు.

"నాకు నిద్ర వస్తోంది శకుంతలా" మత్తుగా అన్నాడు మళ్ళీ.

"సరే! నిద్రపోండి. మరి, మేం వెళ్ళొస్తాం" అంటూ లేచింది శకుంతల.

అలాగే అన్నట్టు తలూపుతూ, నిద్ర మత్తులోకి జారుకున్నాడు, రాంబాబు.

శకుంతల, యిద్దరు కొడుకులూ, బైటికి నడిచారు.

ఆ రాత్రి, రాంబాబుకి కాళ్ళు ఒకటే బాధ పెట్టసాగినయ్. తాను బాధని భరించలేక పోతున్నట్టు, డాక్టరుతో చెప్పాడు.

"నర్స్! రాంబాబుగారికి, రెండు 'కాంపోజ్' మాత్ర లివ్వు" అని చెబుతూ, రాంబాబు నుద్దేశించి—

"చూడండి రాంబాబుగారూ! నర్స్ యిచ్చే మాత్రల్లో ఒక్కటి మాత్రమే వేసుకోండి.... నిద్ర పడుతుంది. అప్పటికీ నిద్ర పట్టకపోతే మరోటి వేసుకోండి. వాటిని యెక్కువగా వాడకండా వుండేందుకు ప్రయత్నించండి" అన్నాడు.

"ఎక్కువ వాడితే, యేమవుతుంది సార్? ఆసక్తిగా ప్రశించాడు, రాంబాబు.

"మోతాదుని మించి వేసుకుంటే, ప్రాణానికే ముప్పు వస్తుందండి! జాగ్రత్త." అంటూ హెచ్చరించి, అక్కణ్ణించి వెళ్ళిపోయాడు, డాక్టరు.

కాస్సేపటికి, నర్సు తెచ్చిచ్చిన రెండు 'కాంపోజ్' మాత్రల్లో ఒక్కటి మాత్రమే వేసుకున్నాడు, రాంబాబు. అతనికి క్రమంగా నిద్ర పట్టేసింది.

* * *

రోజులు గడిచిపోతున్నయ్.

రాంబాబుకి, కాళ్ళ కట్లు విప్పేశారు. రెండు మొండి కాళ్ళూ చూసి, మరోసారి కన్నీరు కార్చాడు, రాంబాబు.

అతని మస్తిష్కంలో యెన్నెన్నో ఆలోచనలు. అతనిలో నైరాశ్యం పరాకాష్ఠకు చేరుకుంటోంది. తాను కోలుకున్నాక, తన భవిష్యత్తేవిఁటి?.... అన్నదే అతని ముందున్న సమస్య.

రెండు కాళ్ళకీ కొలతలు తీసుకుపోయారు. బహుశా, ఆర్టిఫీషియల్ భాగాలు తగిలించి, నడక ప్రాక్టీసు చేయిస్తారుగామోసు! అప్పుడు భుజాల కింద వూత కర్రలు తప్పవేమో! ఛీ! ఛీ!! అదీ ఒక బ్రతుకేనా? నిత్యం యెవరిదో ఒహరి సహాయం పొందుతూవుండాలి. చివరికి, యెంతటి దుర్గతి పట్టింది తనకి? .... యిలా ఆలోచనలు సాగిస్తున్న రాంబాబుకి, జీవితం పట్ల ఓ విధమైన జుగుప్స యేర్పడింది. విరక్తి పుట్టింది కాని, యేం చెయ్యగలడు? ఏవీఁ చెయ్యలేని అశక్తుడు!

రోజులు సాగిపోతూనే వున్నయ్.

రాంబాబు వార్డుబోయ్లందర్నీ మంచి చేసున్నాడు. తనకి కావల్సిన వస్తువుల్ని వాళ్ళచేత తెప్పించుకుంటున్నాడు అడపాదడపా. వారికి డబ్బులిస్తూ, రాంబాబులాంటి మంచి మనిషి మరి లేడన్న పేరు సంపాదించుకున్నాడు 'ధన మూలమిదమ్ జగత్' కదా!

* * *

ఓ రోజు రాంబాబు యెంతో హుషారుగా అగుపించాడు.

ఆ రోజు కుటుంబ సభ్యులతో చాలా సన్నిహితంగా, ఆప్యాయంగా మాట్లాడాడు. అతని మాటల్లో యెక్కడా నిరాశ గాని, నిస్పృహ గాని తొణికిసలాడలేదు. కొడుకులిద్దర్నీ పక్కనే కూచోబెట్టుకుని, అనురాగంతో వాళ్ళ తలల్ని నిమిరాడు.

"ఎప్పటికయినా, మన కుటుంబానికి, మన వంశానికి, మీరే పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తార్రా! ఆ నమ్మకం నాకుంది." మామూలుగానే అన్నాడు. అతని స్వరంలో యే విధమైన మార్పూ ధ్వనించలేదు.

భార్య శకుంతలకేసి, తదేకంగా చూస్తూ, కొన్ని క్షణాలు అలా వుండిపోయాడు. అతని మనోచక్షువుల్లో, గతంలో ఆమెతో గడిపిన యిన్నేళ్ళ సుఖ సంసార జీవితం, లీలగా అగుపించిం దతనికి.

అప్రయత్నంగా రాంబాబు కళ్లు చెమ్మగిల్లాయి. భారంగా ఓ నిశ్వాసాన్నొదిలాడు. ఎంత ప్రయత్నించినా, ఆ వుద్వేగం నుంచి బైటపడలేక పోయాడు. భార్య చేతిని తన చేతిలోకి తీసుకుని, చాలాసేపు అలా వుండి పోయాడు ... అంతరంగంలోంచి దుఃఖం పెల్లుబుక్కొచ్చింది. ఆపుకో లేకపోయాడు. చిన్న పిల్లాడిలా కంట తడి బెట్టాడు. ఏదో చెప్పాలను కున్నాడు. కాని, అతని నోట మాట రాలేదు.

శకుంతలకి, భర్త ప్రవర్తన యేవీ అర్థంకాలేదు. అయితే. ఆయన వుద్వేగాన్ని అర్థం చేసుకుని, యేడవకండా వుండలేకపోయింది. ఏడుస్తూనే భర్త కన్నీరు తుడిచింది.

"ఊరుకోండి ఆ భగవంతుడే మనకి రక్ష" అంది రుద్ధ స్వరంతో.

అంతలో నర్సు వచ్చిందక్కడికి.

"చూడండమ్మా, మీరిలా ఆయన సమక్షంలో యేడ్చి, ఆయనలో నిస్పృహని పెంచకూడదు.... ఆయన కిప్పుడు కావల్సింది మనో ధైర్యం ఇదే పద్ధతిలో మీ ప్రవర్తన వుంటే; మిమ్మల్నిక్కడ యెక్కువసేపు వుంచడానికి అనుమతించం...." అంది కాస్తంత చిరాగ్గా.

శకుంతల, కళ్ళొత్తుకుంటూ మౌనందాల్చింది. మరో పదినిముషాల అనంతరం యింటికి వెళ్ళిపోయింది.

*　　　*　　　*

మర్నాడు, యథావిధిగా సూర్యుడు వుదయించాడు.

హాస్పిటల్లో రోగులందరూ మేల్కొన్నారు. అప్పటికే సూర్యుడు, కిటికీల్లోంచి తొంగి చూస్తున్నాడు .... కాని, రాంబాబు లేవలేదు. సాటి రోగులు లేపారు. అయినా లేవలేదు. చైతన్యరహితంగా పడున్నాడు. వాళ్లు కంగారుపడ్డారు. కేకవేశారు. హడావిడిగా డాక్టరు, నర్సు వచ్చారు. రాంబాబుని తట్టి లేపారు. జీవం వుంటేగా లేవడానికి? డాక్టర్ పరీక్షించాడు. శరీరం అప్పటికే చల్లబడింది. నాడి పట్టుబడలేదు. అంతా నిశ్శబ్దం. డాక్టరు పెదవి విరిచాడు.

"పాపం, దురదృష్టవంతుడు! నర్స్! వీళ్ళవాళ్ళకి తెలియ జెయ్యి..." అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు, డాక్టరు.

ఆ వార్డులో నిశ్శబ్దం చోటు చేసుకుంది. అందరి కళ్ళూ చెమ్మగిల్లాయి.

రాంబాబు మరణానికి కారణం, గుండె ఆగిపోవడంగా నిర్ధారించాడు, డాక్టర్.

రాంబాబు కుటుంబ సభ్యులు వచ్చారు. హృదయ విదారకంగా రోదించారు....

తర్వాత జరగాల్సిన విధులు, చక చకా జరిగిపోయినయ్.

*　　　*　　　*

రాంబాబు చనిపోయిన మూడో రోజు, అతనింటికి ఓ ఉత్తరం వచ్చింది. అదో కవరుత్తరం. పక్కింటి కుర్రాడు ఆ వుత్తరాన్ని శకుంతలకే అందించాడు. అంత దుఃఖంలోనూ, కవరు మీదున్న అడ్రసుపై ఆమె దృష్టి పడింది. చకితురాలయ్యింది. ఆ రాత చూస్తుంటే, తన భర్త చేతిరాతలానే ఉన్నట్టనిపించింది.

ఆమెకి, హృదయ స్పందన అధికమయ్యింది. కళ్లు చెమ్మగిల్లాయి. ఇప్పుడెలా వచ్చిందీ వుత్తరం? ఎక్కణ్ణించి వచ్చింది? ఎన్నో ప్రశ్నలు ఆమె అంతరంగంలో వుత్పన్నమయ్యాయి. ఆమెచేతులు కంపిస్తూ వుంటే, ఆతృతతో ఆకవర్ని చింపింది. లోపలున్న వుత్తరాన్ని తీసింది. ముందుగా ఆమె దృష్టి, వుత్తరాంతంలోవున్న సంతకం మీదికి పోయింది; అది తన భర్త సంతకమే! అందులో సందేహం లేదు .... అనుకుంటూ, సజల నేత్రాలతో, వుద్వేగంతో, ఆ వుత్తరాన్ని చదవడం ప్రారంభించింది.

ప్రియమైన శకుంతలా,

హఠాత్తుగా యీ వుత్తరం చూసి, ఆశ్చర్యపోతున్నావు కదూ! అది, సహజమే!

ఇన్నాళ్ళూ, యిన్నేళ్ళూ భార్యా భర్తలుగా నువ్వూ, నేనూ, యితరులు యీర్ష్య పడేలా, ఆదర్శవంతంగా జీవించాం. మరి కొన్నేళ్ళు యిట్లాగే జీవిస్తామని, వూహించుకుంటూ సుందర స్వప్నాలు కనేవాణ్ణి. కాని, దైవం నా వూహలకు రూపాన్నివ్వదల్చుకో లేదేమో — నిర్దయగా నా రెండు కాళ్ళూ విరిచేశాడు. ఒక కాలు కాదు—రెండు కాళ్లూ యేంప్యూట్

చేసేశారు. నా కంటె దురదృష్టవంతుడు యింకెవరుంటారు చెప్పు? ఇతరత్రా, నేను ఆరోగ్యవంతుణ్ణయి యింటికొచ్చినా, యెందుకూ కొరగాని వాణ్ణే అవుతాను. నా నిత్యావసరాలు తీర్చుకోలేని అసమర్థుణ్ణే అవుతాను. రెండు కాళ్ళూ పోగొట్టుకున్న అవిటివాడిగా, నేను యింకేం వుద్యోగం చెయ్యగల్ను? ఎక్కడికి తిరగ్గలను? అనుక్షణం యెవరి మీదనో ఆధార పడివుంటూ, మీ అందరికీ నేను భారమైపోతాను. ఓ గుదిబండగా తయా రవుతాను. ఔనా? నువ్వయినా యెన్నాళ్లు నాకు సేవలు చెయ్యగలవు చెప్పు? ఆ విధంగా నిన్ను యిబ్బంది పెట్టడం, నా కిష్టంలేదు. అందుకే. మీలో నాపట్ల నిరసన యేర్పడక ముందే, విముఖత చోటు చేసుకోక మునుపే, నా బ్రతుకును పరిసమాప్తి చేసుకోవాలనుకున్నాను. నా కింక జీవించాలన్న ఆశ లేదు శకుంతలా!

'శకుంతలా, పిరికితనంతో నేనీ నిర్ణయానికి రాలేదు తెలుసా? ఒక ధ్యేయంతో, సత్సంకల్పంతో, యీ పనికి పూనుకుంటున్నాను. నాకు యిస్తోన్న నిద్ర మాత్రల్ని కూడబెట్టాను. ఎవరికీ అనుమానం రాకండా, వాటిని నా తలగడ కవర్లో దాస్తూ వస్తున్నాను. నా జీవిత పరిసమాప్తికి, వాటిని పావులుగా వుపయోగించదల్చుకున్నాను. ఈ రోజు రాత్రే, నా యీ నిర్ణయానికి ముహూర్తం పెట్టుకున్నాను, నా ఆలోచన్ని దృఢ చిత్తంతో అమలుపరుస్తాను. రేపు వుదయం నేను వెల్తురు చూడను. ఈ విధంగా, నీ పసుపు కుంకుమల్ని తుడిచేస్తున్నందుకు, నన్ను క్షమిస్తావు కదూ? ఇంతకంటె, మరో మార్గం అగుపించలేదు శకుంతలా! ఏం చెయ్యను? నే నెవరికీ బరువు కాకూడదనే యీ ప్రయత్నం. నువ్వు, ధైర్యంగా వుండు, నువ్వే, యిప్పుడు మన కుటుంబానికి పెద్దవు....అబ్బా యిలకు మార్గదర్శివి. గుర్తుంచుకో! పెద్దబ్బాయికి, నా బదులుగా వుద్యోగం వస్తుంది. చిన్నవాడికి, యేదో ఒహ వుద్యోగం దొరక్కపోదు. తప్పకుండా దొరుకుతుంది. మీరు సుఖంగా జీవించండి, అదే నేను మనసారా కోరుకునేది. మరో ముఖ్య విషయం — ఈ వుత్తరం చదివిన వెంటనే, ముక్కలుగా చించేసి కాలవలో పారేయండి. దీన్ని యితరు లెవ్వరూ చూడకూడదు .... అర్థమయ్యిందిగా! మర్చిపోవద్దు. ధైర్యంగా

వుండు .... నన్ను క్షమిస్తావు కదూ? అబ్బాయి లిద్దరికీ నా ఆశీస్సులు.... శుభాకాంక్షలు ....

నీ—

రాంబాబు...."

ఉత్తరం చదవడం పూర్తి చేసిన శకుంతల, బావురుమంటూ నేల కొరిగిపోయింది. ఆమె చేతిలో వుత్తరం రెప రెప లాడుతోంది. భర్త హెచ్చరిక మర్చిపోయిందా క్షణంలో.

"అమ్మా .... అమ్మా ...." ఆత్రంగా అంటూ ఆమెని లేవనెత్తి కూచోబెట్టాడు, పెద్దబ్బాయి రవి.

శకుంతల కళ్ళు తెరిచి, పిచ్చిగా చూస్తూ, వుత్తరాన్ని రవికి అందించింది.

రవి, ఆ వుత్తరాన్ని వుత్కంఠతో చదివాడు. కుమిలి కుమిలి యేడుస్తూ "ఎంత పని చేశావు నాన్నా...." అన్నాడు.

ఉత్తరంలో తండ్రి హెచ్చరిక గుర్తు కొచ్చింది రవికి. ఆయన సూచించినట్టే, వుత్తరాన్ని ముక్క ముక్కలుగా చించి, బైట మురుగు కాలవలోకి విసిరేశాడు.

ఆ యింట్లో నిశ్శబ్దం చోటు చేసుకుంది.

[ఆకాశవాణి విశాఖపట్నం వారి సౌజన్యంతో]

* షాలీమార్ ఆంధ్రా అసోసియేషన్ వార్షిక సంచిక, 1991*